# సంకల్పం (నియ్యత్) గురించిన వివరాలు

**31వ అంశం :** సంకల్పానికి అనుగుణంగా కర్మలకు ప్రతిఫలం లభిస్తుంది

عَنْ عُمَرَبْنِ الْخَطَّابِ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُوْلَ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ يَقُوْلُ: "إِنَّمَا الْأَعْمَالُ بِالنِّيَّاتِ وَإِنَّمَا لِكُلِّ امْرِىءٍ مَّانَوى فَمَنْ كَانَتْ هِجْرَتُهُ إِلَى دُنْيَا يُصِيْبُهَا أَوْ إِلَى امْرَأَةٍ يَنْكِحُهَا فَهِجْرَتُهُ إِلَى مَا هَاجَرَ إِلَيْهِ" رواه البخاري[1]

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) తెలియజేశారు: ఆచరణలు సంకల్పంపై ఆధారపడి ఉంటాయి. ప్రతి మనిషికి అతను సంకల్పించుకున్నదే లభిస్తుంది. ఎవరయితే ప్రాపంచిక సంపదను కూడబెట్టుకోవటానికి లేదా ఏ స్త్రీనయినా వివాహమాడటానికి ప్రస్థానం (హిజ్రత్) చేస్తే అతను దాని కోసమే ప్రస్థానం చేసినట్లుగా పరిగణించబడుతుంది. *(బుఖారీ)*[1]

**32వ అంశం :** ఇతరులకు చూపించటం కోసం ఉపవాసముంటే షిర్క్ (బహు దైవారాధన)కు పాల్పడినట్లే.

عَنْ شَدَّادِ بْنِ أَوْسٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ سَمِعْتُ رَسُوْلَ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ يَقُوْلُ: مَنْ صَلَّى يُرَائِي فَقَدْ أَشْرَكَ وَمَنْ صَامَ يُرَائِي فَقَدْ أَشْرَكَ وَمَنْ تَصَدَّقَ يُرَائِي فَقَدْ أَشْرَكَ. رواه احمد[2] (حسن)

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్ (రజి) తెలియజేశారు : ప్రదర్శనాబుద్ధితో నమాజ్ చేసినవాడు బహుదైవారాధనకు ఒడిగట్టినట్లే. ప్రదర్శనాబుద్ధితో ఉపవాసమున్నవాడూ బహుదైవారాధనకు ఒడిగట్టినట్లే. అలాగే ప్రదర్శనాబుద్ధితో దానధర్మాలు చేసినవాడు కూడా బహుదైవారాధనకు ఒడిగట్టినట్లే. *(అహ్మద్-హసన్)*[2]

**33వ అంశం :** ఉపవాసం ఉంటున్నానని మనసులో అనుకోవటమే సంకల్పం. పోతే నేడు బహుళ ప్రచారంలో ఉన్న "వ బిసౌమి గదిన్ నవైతు" లాంటి పదాలన్నీ నిరాధారమైనవే.

---

1) *జుబైదీగారి సహీహ్ బుఖారీ సంక్షిప్తం -1వ హదీసు*

2) *షైఖ్ ముహియుద్దీన్ గారి అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్ గ్రంథం మొదటి సంపుటి 43వ హదీసు*

**34వ అంశం:** విధి (ఫర్జ్) ఉపవాసానికి సంబంధించి ఉషోదయానికి పూర్వమే సంకల్పం చేసుకోవటం అవసరం

**عَنْ حَفْصَةَ رَضِيَ اللهُ عَنهَا قَالَتْ: قَالَ رَسُوْلُ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ: "مَنْ لَّمْ يَجْمَعِ الصِّيَامَ قَبْلَ الْفَجْرِ فَلَا صِيَامَ لَـهُ". رواه ابوداؤد والترمذی**[1]

హజ్రత్ హఫ్సా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఉషోదయానికి పూర్వం ఉపవాసం ఉంటున్నామని సంకల్పించుకోని వారి ఉపవాసం నెరవేరదు. (అబూదావూద్, తిర్మిజీ)[1]

**35వ అంశం :** నఫిల్ ఉపవాసాల సంకల్పం పగటిపూట సూర్యుడు నెత్తి నుండి వాలకముందు ఎప్పుడైనా చేసుకోవచ్చు.

**36వ అంశం:** నఫిల్ ఉపవాసాన్ని ఎప్పుడైనా, ఏ కారణం చేతనయినా విరమించవచ్చు

**عَنْ عَائِشَةَ أُمِّ الْمُؤْمِنِيْنَ رَضِيَ اللهُ عَنهَا قَالَتْ: دَخَلَ عَلَيَّ النَّبِيُّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ ذَاتَ يَوْمٍ، فَقَالَ: هَلْ عِنْدَكُمْ شَيْءٌ؟ فَقُلْنَا: لَا. قَالَ: فَإِنِّي إِذَنْ صَائِمٌ، ثُمَّ أَتَانَا يَوْمًا آخَرَ فَقُلْنَا يَارَسُوْلَ اللهِ! أُهْدِيَ لَنَا حَيْسٌ فَقَالَ: أَرِيْنِيْهِ فَلَقَدْ أَصْبَحْتُ صَائِمًا فَأَكَلَ. رواه مسلم**[2]

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం : ఒకరోజు దైవప్రవక్త (సల్లం) మా ఇంటికొచ్చి "మీ దగ్గర (తినడానికి) ఏమయినా ఉందా?" అని అడిగారు. మేము ఏమీలేదని చెప్పాం. అందుకాయన, "సరే, అయితే నేను ఈ రోజు ఉపవాసం ఉంటాను" అని అన్నారు. అలాగే మరో రోజు ఆయన మా ఇంటికొచ్చినప్పుడు మేము "దైవప్రవక్తా! మనకు హల్వా కానుకగా వచ్చింది" అని చెప్పాం. అది విని ఆయన (ఆతురతతో) "ఏదీ, ఇలా తీసుకురండి, నేను ప్రొద్దున్నుంచి ఉపవాసంతో ఉన్నాను" అంటూ దాన్ని తీసుకొని తిన్నారు. *(ముస్లిం)*[2]

---

*1) అల్‌బానీగారి సహీహ్ సుననె తిర్మిజీ మొదటి సంపుటి 583వ హదీసు*

*2) అల్‌బానీగారి సహీహ్ ముస్లిం సంక్షిప్తం 630వ హదీసు*